# నేనేం చేశాను?

నాకు సంఘంలోంచి వెలి, చర్చిలోంచి వెలి; నా తలిదండ్రులూ, బంధువులూ దగ్గిరికి రానీరు; స్నేహితులు మొహాలు తప్పించేశారు. నేను పాపాత్మురాల్ని; నా బుద్ధి స్వతహా పాపపుబుద్ధి, తలిదండ్రులూ, బోధకులు, భర్త, దేవుడు, యేసుక్రీస్తు, అంతరాత్మ, దేవదూతలు అందరూ వొద్దని నాకు బోధిస్తూ వున్నా, కావలసి, పట్టుపట్టి, పెడబుద్ధితో, దుర్నీతిమార్గంలో ప్రవేశించానని పుణ్యాత్ముల వుద్దేశ్యం. జరిగిందేమిటో చెప్పనా?

నేను చిన్నప్పుడే కొన్ని సంగతులు నేర్చుకున్నా. మొగపిల్లలకీ, ఆడపిల్లలకీ సృష్టిభేదం కంటే సంఘంలో యెక్కువ భేదం మొగపిల్లలు చేసిన పనులు అనేకం ఆడపిల్లలకి పనికిరావు. ఒకరితో ఒకరు చనువుగా వుండకూడదు. కొన్నాళ్ళకి ఇంకోసంగతి తెలిసింది. మొగజాతికీ ఆడజాతికీ ప్రబలమైన విరోధం. పిల్లులూ, యెలకలూ ఎట్లానో అట్లాను. పిల్లి యెలిక దగ్గిరికి వెళ్ళినా యెలుకకే హాని, యెలిక పిల్లిదగ్గిరికెళ్ళినా యెలిక్కే హాని. మొగజాతితో స్నేహము చేసినా, లేక మొగజాతి చేసే పనులు చేసినా, ఆ ఆడదాన్ని మొగజాతీ వెళ్ళకొడుతుంది, ఆడజాతీ వెళ్ళకొడుతుంది. మొగజాతి ఆడజాతిని యెప్పుడూ తరుముతుంది. కొందరు తరమని మొగవాళ్ళుండవొచ్చు అది సక్రుతు. యెలికని పట్టలేని పనికిమాలిన పిల్లి వున్నట్టే. అట్లాంటి మంచి మొగమనిషిని కూడా దగ్గిర చేరనియ్యకూడదు. యే నిమిషాన యేం బుద్ధి పుట్టుతుందో? అదిగాక దొంగ పిల్లు

లంటూ వుంటాయి. రుద్రాక్షపిల్లులూ, మడిబట్టల పిల్లులూ, సన్యాసిపిల్లులూ మొదలయినవి. మొగజాతి తరుముతో వుంటే, ఆడజాతి తెరచాటున, కిటికీలు మూసిన బిళ్ళలోనూ, తండ్రుల వెనకాలా దాక్కోవలసిందే! కాని "మీ భయం నాకేమిటనకూడదు. భయపడ్డట్టు పడి, ముసి ముసి నవ్వులు నవ్వి, సిగ్గుచూపి, ఒక వోరచూపు వొదిలేసి "నేనట్టాంటిదాన్ని కాదు", "మా వాళ్ళతో చెపుతా భద్రం", "నువ్వు అన్నపంటివాడవు" అని తప్పుకోవాలి. "మొగవాళ్ళ అవసరం నాకులేదు. నా తోవనాది వాళ్ళతో నాకేం పని" అనకూడదు ఆడది. "మొగాళ్ళు నాకు కావాలి. వాళ్ళు లేకపోతే యెట్లా? నేను నిలవలేను. వాళ్ల నాకవసరం" అని అనకూడదు. అది ఒక ప్రబంధ స్త్రీలకే తగింది. మొగాళ్ళు అక్కర్లేదనడం తప్పే, కావాలనడం తప్పే. మొగవాడంటే యెరగనట్టు దాక్కుంటో, సిగ్గుపడుతో, యేడుస్తో, మొగాడిచేత బలవంతం చేయించుకోవడం మర్యాద. మొగాడికి చిక్కనూ కూడదు. చివరికి చిక్కనూ చిక్కాలి అదే వేట సరదా.

ఒకటే సాధనం; ఒకటే ముక్తి; పెళ్ళి. ఆడదెందుకు పుట్టింది? పెళ్ళికి. పిల్లల్ని కనడానికి, వాళ్ళని పెంచడానికి, తరవాత వాళ్ళకి పెళ్ళిళ్ల చెయ్యడానికి. మొగాళ్లు అనేక పనులకి పుడతారు-వుద్యోగాలు చెయ్యడానికీ పొలాలు దున్నడానికీ, విద్వాంసులు కావడానికీ. ఆడది మాత్రం ఒకటే పనికి. ఆ పనికి సంబంధించిన వాటికీ. ఆవులు పాలిచ్చేందుకు, యింకెందుకు? మా క్రైస్తవుల్లో వుద్యోగాలుచేసే ఆడవాళ్లున్నారు. అదీ సంసారం కోసమే. అంతే. పెళ్ళిచేసుకోని ఆడది విచిత్రమైన మనిషి. అనుమానపడవలసిన విషయమే. యెంత మంచిదైనా పెళ్ళంటే ఒక మొగాడు తనని బలవంతం చెయ్యడానికి వొప్పుకోడం. ఒక్కడే, యెక్కువ కూడదు. ఆ ఒక్కడూ యావజ్జీవం వుంటాడు. మార్చుకోడానికి వీల్లేదు. బావుండలేదనకూడదు. బావుండకపోయినా బావున్నట్టే నటించాలి. బావుండలేదని మనసులో కూడా అనుకోకూడదు. బజారులో మిటాయికొన్నట్టే. ఈ మిటాయి ముందు రుచి చూచి కొనకూడదు. కొంచెంగా వాసన చూడొచ్చు. లేకపోతే యితరులు వాసనచూచి బావుందని చెపితే నమ్మాలి. హిందువుల్లో ఆచారముదీ. దుకాణం దగ్గిరికే పోనీరు మహమ్మదీయులలో. దూరాన్నించన్నా

చూడనీరు. కొన్నతరవాత మిటాయి తినాలి. తినితీరాలి. అంతా మింగాలి. ప్రతిరోజూ మింగాలి. లేకపోతే భార్యంటే యేమిటి? 'లా', సంఘం అన్నీ మీద విరుచుకుపడతాయి. ఒక్కసారి మిఠాయి కొన్న తరవాత యింక తలెత్తి, దుకాణాలవంక చూడకూడదు. తన పొట్లంపరకే వుండాలి కళ్ళు. దుకాణంవాళ్ళు పిలిచినా కళ్లెత్తకూడదు. వాళ్ళు మంచి దీపాలు వెలిగించి, అద్దాలుపెట్టి చూడమంటారు. కొత్తమిఠాయి చేశామంటారు. కాని పొట్లం పంకే చూడాలి. యింకోళ్ళ చేతుల్లో మిఠాయి కాశించకూడదు. "నాదీ మంచిదే" అనాలి. వాళ్ళేపరన్నా రుచి చూస్తామంటే యియ్యకూడదు. లాక్కుంటే పోట్లాడాలి యిదీ పెళ్ళి.

నేను బళ్ళో చదువుకునేదాన్ని. నాకు పన్నెండేళ్ళప్పుడు ఒక సంగతి జరిగిండి. నాకోలెక్క రాకపోతే,మావీధిలో వున్న పాత అబ్బాయిదగ్గిరకెళ్ళి చెప్పించుకున్నాను. అది మా నాన్నచూసి, "అక్కడికెందు కెళ్ళావు. తోడి పిల్ల రాజమ్మదగ్గిర నేర్చుకోకపోయినావా" అని కోప్పడ్డాడు. ఆ అమ్మాయి యిల్లుదూరం. అదీగాక ఆ పిల్లకీ నాకూ పోట్లాట. ఆ కారణం మానాన్నకి నచ్చిందికాదు. "మొగాళ్లతో నీకేం పని, యీసారి వెడితే వీపు చీలుస్తా" నన్నాడు.

యింకోరోజు మా టీచరు నాతో మాట్లాడుతో కొంత దూర మొచ్చాడు. మా యిద్దరి వెనకాలా యింకో స్కూలుపిల్లలు యేమిటో కేక లేశారు. అది అమ్మతో యెవరో చెప్పారు. నన్ను కొట్టింది. నాన్నతో చెప్తు తానంది. వొద్దని బతిమాలుకున్నా. కాని నేనుచేసిన తప్పేమిటో నా కర్థం కాలా.

యింకోసారి క్రిస్టమస్ వనభోజనానికెళ్ళాం. పిల్లలం చాలామందిమి ఆడుకుంటున్నాము. ఒక కుర్రాడు, పదిహేనేళ్ళబండ వొచ్చి ఒక చిన్న అమ్మాయి బొంగరం లాక్కుని తిప్పడం మొదలు పెట్టాడు. ఆ పిల్ల యేడ్చింది. ఆ మొద్దు పరధ్యానంగా వున్నప్పుడా బొంగరం లాక్కున్నాను. వాడు నాతో కలియపడ్డాడు. బొంగరం పావళ్లో దాచేశాను. యిది మా పాస్టరుగారు చూసి నాన్నతో చెప్పారు. నాన్న ఆ రాత్రి నన్ను కొట్టాడు. యెవరికన్నా సహాయం చేయడానికైనా సరే, మొగజాతితో పోట్లాడకూడ

దనుకున్నా. ఆ అబ్బాయినేం చేశారు నాతో కలియపడ్డందుకు? యేమీ అనలేదు. మొగమహారాజు అతనికేం?

యింకొకసారి నాకు పదమూడేళ్లున్నప్పుడు, పాస్టరుగారి అమ్మాయి రత్నమ్మకోసం వెళ్ళాను. ఆ అమ్మాయిలేదు. ఆమెకిచ్చిన ప్రయిజు పుస్తకాలు చూస్తో నుంచున్నా. పాస్టరుగారి మేనల్లుడు వచ్చి నన్ను పలకరించాడు. అతన్ని చూస్తే నాకిష్టమేకాని నా అనుభవం ప్రకారం, సిగ్గుతో మూలకు నక్కి, తప్పించుకోవడానికి తోవ వెతుకుతున్నా. అతను నన్ను పట్టుకుని ముద్దు పెట్టుకొన్నాడు. తప్పించుకుని పారిపోయి వొచ్చేశా. రత్నమ్మతో చెప్పా. నవ్వింది. యేదో గొప్ప తప్పు చేశాడనీ, నాకు గొప్ప అపకారం జరిగిందనీ, అట్లాంటి విషయం దాచకూడదనీ, చర్చిలో బోధించిన విషయాలూ అవీ జ్ఞాపకం తెచ్చుకుని, చెపితే ఆ అమ్మాయి నవ్వింది. వాళ్ళ బావమీద పక్షపాతమనుకొని వెళ్ళి అమ్మతో చెప్పాను. అట్లాంటి సంగతి రత్నమ్మతో చెప్పినందుకు నన్ను చెడ్డతిట్లన్నీ తిట్టింది. నాన్నతో చెప్పింది. నాన్న నన్ను కొట్టడానికి తాడు తీసుకొచ్చాడు. 'ఇట్లాంటి పనులు చేసి మా కపరిదిష్ట తీసుకొస్తావా? అందులో పాష్టరిగారింటో? ఆయనకి తెలిస్తే యింకేమన్నా వుందా? నీ మొహానికి పెళ్ళెట్టా అవుతుంది?' అని వొకటే గోల, నేనేం చేశాను?

యిట్లాంటి విషయాలు కొన్ని జరగడంతోటే, నాకు పెద్ద భయం పట్టుకుంది మొగాళ్ళంటే. వాళ్ళకి ఆడది చిక్కితే, యేమన్నాచేస్తారు, చేశారని చెప్పకుండా. ఆడదానికే తిట్లూ, వెలీ. నోరు మూసుకుని వూరుకోడం మంచిది. మొగతత్వము చెడదు, పదహారు వన్నెల బంగారం. యేంచేసినా సరే, అది పవిత్రమే 'యేదో చిన్నప్పుడు తిరిగాడు అయిపోయింది' అంటారు. కళ్ళుతెరచుకుని గొప్ప మత సంస్కర్తలు, నీతి బోధకులు, వాళ్ళని తమలోకి తీసుకుంటారు. తమ పిల్లల్నిస్తారు వాళ్ళు. ఆడదానికి అన్యాయం జరిగినాసరే, కొంచెం అనుమానం కలిగినా సరే, కొంచెంగా జాలిపడి, దాని కర్మమని వీలైతే, అదేం చేసిందని, యిన్ని వేదాంతాలు చెప్పి, దూరానుంచుతారు.

నాకు పదిహేనేళ్ళప్పుడు మేమున్న యింటిపక్కన వున్న వాళ్ళు వెళ్ళి యింకెవరో వొచ్చారు. మా భాగానికీ దానికీ మధ్య తలుపుంది. అది అటూ యిటూ సాధారణంగా గొళ్ళెం వేసివుంటుంది. ఆ భాగంలో వున్న వాళ్ళు ఒక ముసలమ్మా, ఆమె మనమడూ. వాడికి పద్దెనిమిదేళ్లు. చదువూ యేం లేదు. వాడో రౌడీ రౌడీలతో స్నేహం. అతనూ మళ్ళీ క్రిస్టియన్లలో లెఖ్ఖ. నన్ను చూసినప్పటినుంచి ఆ వెంకటస్వామికి నామీదే కళ్లు. ఒకటి రెండుసార్లు వాళ్ళ గుమ్మంలో నుంచుని నన్ను రమ్మని చెయ్యి వూపాడు. అమ్మతో చెపితే బయట గుమ్మంలో యెందుకు నుంచున్నావని చివాట్లే సింది.

ఒకరోజు ఆదివారం నాకు తలనొప్పిగా వుండి గుడికి వెళ్ళలేదు. వొంటరిగా ఇంటో పడుకునివున్నా. మా యింటికీ పక్క భాగానికి మధ్య వున్న తలుపు యెవరో వూయించినట్టు చప్పుడయింది. యేమిటా అని లేవ బోతూ వుంటే వెంకటస్వామి వొచ్చాడు. రాత్రి యేడవుతుంది. దీపమన్నా లేదు. లేచి వెళ్ళబోయినా అడ్డమొచ్చాడు.

యిక్కడి కెందుకొచ్చావు అన్నా.

"నువ్వేగా రమ్మన్నావు? ఆ గడియ తీసిందెవరు?"

"ఛా! నేను కాదు పో, అరుస్తా"

"భయమేం? దగ్గిరెవరూ లేరు, వున్నారానీ. నన్నెందుకు రమ్మ న్నావో కనుక్కుంటారు" అన్నాడు.

వుత్త బెదిరింపులని తెలుసు. అరిస్తే యెవరన్నా వొచ్చి రక్షించే వారే కాని యేమొచ్చినా ఆడదానికే గాని మొగాడికి యేం పరవా లేదని తెలుసుగా? నేను రమ్మన్నానే అనుకుంటారు అందరూ. ఒక్కరూ నా పక్ష ముండరు. మా నాన్న చేతుల్లో దెబ్బలు. మాట్లాడకండా వొణుకుతో నుంచున్నా. నన్ను కావిలించుకుని లాక్కెళ్ళి మంచంమీద పడేశాడు.

* * *

నాన్నా వాళ్లూ రాత్రి యెనిమిది కొచ్చేటప్పటికి, యేమీ జరగనట్టు మూలుగుతో పడుకున్నా. అన్నానికన్నా లేవలేదు. నా మొహం చూస్తే

జరిగిందంతా కనుక్కొంటారని భయం. తెల్లవారిలేచి నేనే మన్న రూపం మారానేమోనని అద్దంలో చూచుకున్నా. అయిదారు రోజులదాకా భయం పొదల్లేదు. యింక వెంకటస్వామి బానిసనైనా. అతను యేం చెపితే అది చేసితీరాలి. అయినా యెప్పుడో వొకప్పుడు కనపడి, స్తలమూ కాలమూ చెప్పిరమ్మనేవాడు. వెళ్ళి తీరాలి. ఆ తలుపు గడియ బిగించా, వూపినా, రాకండా-అయినా నాచేత తీయించి, మావాళ్ళందరూ పడుకుని వుండగానే రెండు మూడు సార్లొచ్చాడు. అతనికేం కనుక్కొంటే, నేనే గడియతీసి తనని పిలిచానంటాడు. మొగాడికేం? అతనికి తినడానికి, నా కింటో యేం పెట్టినా, దాచి, తీసికెళ్ళి యియ్యాలి. డబ్బులు దొంగిలించి తీసుకుపోవాలి. మాట్లాడితే అంతా చెప్పేస్తానంటాడు. నేనబద్ధమంటే నమ్ముతారా? అబద్ద మన్నా, నన్ను పరీక్షచేసి కనుక్కోగలరని నాకు భయముండేది. నాకేం తెలుసు యీసంగతులు? నాతో మాట్లాండిందెవరు? మొగాడి సంగతెత్తితే తన్నేవారేగాని, యింకేమన్నా నాకు చెప్పినవారున్నారా? కోపమొస్తే వినరాని బూతులన్నీ మాట్లాడేవాడు నాన్న నాముందే. పోనీ యీ విషయాలు నాతో విప్పిచెప్పి వుండకూడదూ? వెంకటస్వామినీ, అతని మురికితనాన్నీ, మోటు తనాన్నీ, చూస్తే నాకు రోత. కాని అన్నీ సహించేదాన్ని—ఒక రోజు రాత్రి తాటితోపులోకి రమ్మన్నాడు. యెవరో స్నేహితుల్ని తీసుకొచ్చాడు. కాళ్ళ మీదపడి యేడ్చా.

అంతా అమ్మతో చెప్పేద్దామనిపించేది. కాని చెపితే చంపేసి, యింటోంచి, వెళ్ళకొడతారని భయంవేసేది. దానికంటె యీ వెంకట స్వామితో యిబ్బందులేనయం. అతి నీచమయిపోయింది, నా బతుకు. నేను నాదాన్ని కాదు. దొంగచూపు, దొంగచాష్టలు, దొంగమాటలు.

చివరికోరోజు తెలిసిపోయింది. వెంకటస్వామి నన్ను బలవంతంగా స్వాధీనం చేసుకుంటో వుంటే అమ్మ వొచ్చింది. వున్న దాన్ని వున్నట్టు వొదిలి అతను పారిపోయినాడు. నేనెట్లాంటి స్థితిలో వున్నానో చెప్పలేను. ఒక్క నిమిషం వ్యవధి యివ్వకండా అమ్మ నామీద విరుచుకుపడ్డది. యేమి టని అడగలేదు; మాట్లాడలేదు. మళ్ళీ అరవదు. యిదివరకుమల్లే. యెప

రన్నా వింటారని భయం. రహస్యంగా, బిగించి, బిగించి తిడుతో, నన్ను కొట్టింది. జుట్టుపీకింది, గుద్దింది, గొంతు పిసికింది. వొదిలేసి యాడవడం మొదలు పెట్టింది. నాన్నసంగతి తలుచుకుని ప్రాణాల్లో ప్రాణాలు లేకుండా వొణుకుతున్నా. వొచ్చాడు. పరిగెత్తికెళ్ళి చెప్పింది. తలుపుమూసేసి, కర్ర తీసుకుని వొచ్చి దాంతో బాదాడు. నెత్తిపగిలి రక్తంకారుతోంది, వొదల్లా, బిగ్గిరిగా యేడ్చా. నోరుమూసి, గిల్లాడు.

యిన్ని దెబ్బలుతిన్నా, వెంకటస్వామి వొదిలి పోయినాడనే సంతోషము నాహృదయంలో పొంగిపోతోంది. యింక వాణ్ణి మా నాన్న బతకనిస్తాడా? కాని మర్నాడు యేం జరగనట్లు వూరుకున్నారు. వాళ్ళ వాళ్ళతో చెప్పలేదు. వాణ్ణి యేమనలేదు. యీసారి వెంకటస్వామివస్తే మాత్రం చెప్పమన్నాడు, ఒకసారివొచ్చాడు. యింటో యెవరూ లేరు. యింకొక సారి నాన్న దాక్కుని నేను వంటరిగా వున్నట్టు, వుంచాడు. వెంకటస్వామి రాగానే, పట్టుకుని, కొట్టడానికి కర్రెత్తాడు.

"వంటిమీద దెబ్బపడనీ చెపుతా. నేను మంచివాణ్ణి కాన"న్నాడు.

"యేం చేస్తావు?"

"యీ సంగతంతా బయట పెట్టేస్తా"

"పెట్టు. నిన్ను నమ్మేదెవరు? పోలీసుల కప్పచెపుతా."

"నమ్మరూ? యీ చీటీ చూడండి. తనని యేం చెయ్యొద్దని బతిమాలుతో రాసింది."

నాన్న ఆ చీటీచూసి చింపేశాడు. వెంకటస్వామి నవ్వాడు అట్లాటి పతనిదగ్గిర యింకో యాభై వున్నాయి.

"రాశావా?" అని అడిగాడు నాన్న.

"అవున"న్నా.

"మరి నేనేం యెరగనని అబద్ధపు కూతలెందుకు కూశావని" జుట్టు పట్టుకున్నాడు. వెంకటస్వామినేం చెయ్యలేక, నామీద ఆ కోపం చూపించాడు. నేలకేసి కొట్టాడు. పాపం. పశువు, వెంకటస్వామి హృదయం మెత్తపడ్డది నాన్నని పట్టుకుని నెట్టేశాడు.

"ఆ అమ్మాయినట్లా కొడితే, నేనూరుకోను. మీ యింటో నుంచి లేపతీసుకుపోతా? అన్నాడు. నాన్న నోరు వెళ్లాడేసి తెల్లపోయి చూశాడు. అప్పట్నించి నాకు దెబ్బలు తగ్గాయి. వెంకటస్వామికిప్పుడు రావడానికి దొంగ తనం లేదు. రాత్రీ పగలు యిష్టమొచ్చినట్టు వొస్తున్నాడు. మా నాన్నా మా అమ్మా చూడనట్టు వూరుకునేవాళ్ళు. యెవరన్నా బంధువులొస్తే, అతన్ని స్నేహితుడుమల్లే మర్యాద చేసేవారుకూడాను. అమ్మ అతనికోసారి టీ కూడా యిచ్చింది. అమ్మా నాన్నా భయం తగ్గిన తరవాత, నాకు యెక్కువ కష్టంగాలేదు. వెంకటస్వామిమీద ఒక విధమైన యిష్టం కూడా కలిగింది. హిందూ ఆడపిల్లలకి యిల్లాంటి భర్తలమీదే కొన్నాళ్ళకి యిష్టం కలగ టంలా !

ఆ రోజునించి మా వాళ్ళు నాకు పెళ్ళిసంబంధాలు తొరతొరగా వెతుకుతున్నారు. ఒక నెలలోగా యెవరికో ఒకరికిచ్చి కట్టపెట్టాలని నిశ్చ యమయింది. అంత తొందరెందుకో అప్పుడు నాకర్థం కాలేదు. ఒకరోజు నాన్న అమ్మా మాట్లాడుకుంటున్నారు.

"నెల్లో కాదేమో"

"అయితీరాలి యే నిమషాన యేమవుతుందో తెలియదు. కనుక్కొన్నావా? యిప్పటి వరకేం లేదుగద?"

"లేదు మొన్న బుధవారమే........"

"రావడం వాడు మానడు. నెలలో దొరుకుతుందా సంబంధం?"

"యెవడో వొకడు. అట్టేదూరం ఆలోచించొద్దు. దీని పాడుమొహా నికి దొరికిందే గొప్ప"

"అంతగా ఇబ్బందేదన్న తటస్థిస్తే ఈ వెంకటస్వామికే కట్టి పెట్టొచ్చు"

"ఛా! ఛా! వాడికొద్దు వాడు మాలాడు."

మేము తెలగ క్రిష్టియన్లం, వాడు మాల క్రిష్టియను. వాడికి నన్నిస్తే అందరిలో మర్యాదపోతుంది. వాళ్ళు చూస్తోవుండగా, నన్ను బలవంతంగా అట్లా వుపయోగించడానికి ఆ మాల క్రిష్టియను పనికొచ్చాడు కాని పెళ్ళి చేసుకోడానికి పనికి రాలేదు.

యీ సంగతి పైకిరాకముందే, నాకు పెళ్ళిచెయ్యాలని మా వాళ్ళకి పెద్ద ఆదుర్దా పట్టుకుంది. పాపం, వాళ్ళకి నిద్రలేదు, తిండిలేదు. నాన్న సగమైనాడు. నాకు వాళ్ళనిచూస్తే చాలా దిగులేసేది. యెక్కడ వెంకటస్వామి చెప్పేస్తాడో, యెక్కడ యెవరన్నా చూస్తారో అని భయం. బయటికొచ్చిందా, నాకింక పెళ్ళికాదని మావాళ్ళకి తెలుసు. పెళ్ళికాకపోతేనేం? అమ్మా! యెదిగిన ఆడపిల్ల కొంగున కట్టుకొన్న నిప్పుకాదూ? కుక్క ముట్టుకున్న అన్నం బ్రాహ్మలకి పనికిరానట్టు, ఒక మొగాడు ముట్టుకున్న ఆడది, యింకొకడికి పెళ్ళికి పనికిరాదు. పెళ్ళాంగా కాకండా, పనికొస్తుంది. ఆడది చెడిపోతుంది. మొగాడు చెరుపుతాడు, మనసు వకరిమీద వున్నా, ఉత్తశరీరాన్ని యింకోరు పెళ్ళిచేసుకుంటారు. శరీరం యింకోరు ముట్టుకున్నట్టు తెలిస్తే, మనసు పవిత్రమైనా అవతల పారేస్తారు. దీని కపవిత్రమైన, దివ్యమైన ఆజన్మాంత నిరంతర నిర్బంధ పాశంతో కట్టిన పెళ్ళి అని పేరు. యెంత వుదారమైనది కానీ, ధైర్యశాలీ, స్వార్థత్యాగీ, నిష్కపటీ, భక్తురాలూకానీ, ఆ వొక్క పనితో చెడిపోతుంది. అబద్ధాలు చెప్పొచ్చు, మోసం చెయ్యొచ్చు. నీచమైన సమస్త కార్యాలూ చెయ్యొచ్చు. పరవాలేదు. ఆడవాళ్ళకి బైబిలు "కమాండుమెంటు ఒకటే".

చివరికి హాస్పిటల్ కాంపవుండరు నొకాయన్ని పట్టారు. ఆయన చిన్నవాడేగాని రెండోపెళ్ళి. మొదటినించీ ఆయన నామీద దయగా వుండేవాడు. నాపూర్వ చరిత్ర చెప్పకండా ఆయన్ని పెళ్ళి చేసుకోవడం, చాలా కష్టమనిపించింది. మా అమ్మతో ఆయనతో అంతా చెప్పేస్తానన్నాను. ఆ మాటకి నన్ను చంపేసేటంత మండిపడ్డది. నన్నింటోంచి వెళ్ళకొట్టేస్తామన్నారు. వెంకటస్వామికి పాపం, నిజంగా నామీద ప్రేమేననుకుంటా. తన దగ్గిర్నుంచి వెళ్ళిపోతానని ఒకరోజు యేడ్చాడు కూడాను. తనతో లేచివొస్తే పెళ్ళి చేసుకుంటానన్నాడు. అట్లానన్నా చేశానుగానే అని దిగులేస్తుంది యిప్పుడు. కాని ఆ మిషనరీలూ, ఆ దైవసేవకులూ, మా యిద్దరికీ, లేచివొచ్చిన వాళ్ళకీ, పెళ్ళిచేసేది?

పదిహేను రోజుల్లో పెళ్ళయింది. నేను నా భర్తయింటికి కాపరానికి వెళ్ళాను. ఆరునెల్లు హాయిగావున్నా. యీ లోపల అప్పుడప్పుడు వెంకట

స్వామి మాపుట్టింటి బంధువుడిపలెవొచ్చి చూస్తోవుండేవాడు. కాని నన్నేమి చెయ్యలేదు. చాలా మర్యాదగా బయట కూచుని వెళ్ళేవాడు. నేను వొక్క తెనే వున్నానసరే. ఒకరోజు బాగా తాగివొచ్చి, వెర్రిమాటలు మాట్లాడం మొదలుపెట్టాడు. నాకు పెళ్ళయి వొచ్చేసినందుకు తనకు కలిగిన విచారం మరిచిపోవడానికి తాగడం మొదలుపెట్టా నన్నాడు. నా భర్తని యెప్పుడో వొకప్పుడు తన్ని, నన్ను లాక్కెడతానని యిట్లా మాట్లాడి కొంచెం తెలివి వొచ్చింతరవాత వెళ్ళాడు. ఒకవారం రోజుల్లో మళ్ళా వొచ్చి డబ్బులియ్యకపోతే మని ప్రాణం తీశాడు. నేను మొన్నతాగి వొచ్చిందానికి బాగా చీవాట్లేశాను. నాభర్తవింటే నాకు వొచ్చే వుపద్రవం మాటచెప్పాను. డబ్బులిస్తే మళ్ళా యెన్నడూరానని, డబ్బుతీసుకువెళ్ళిపోయినాడు; కాని నాలుగైదు రోజుల కోసారివొచ్చి డబ్బులడిగేవాడు. భయపడీ, జాలేసీ, యిచ్చేసేదాన్ని. నాదగ్గర డబ్బయిపోయింది. ఆయన్ని యింటికర్చుకని వూరికే అడగడం మొదలు పెడితే, ఆయనకి అనుమానం తగిలింది. కొన్నాళ్ళకి గిన్నెలియ్యమనీ, నగలిమ్మనీ మొదలుపెట్టాడు. నాతో యెప్పటివలె మాట్లాడుతున్నా డను కొని యింటోవాళ్ళేమీ అనుమాన పడేవాళ్ళు కాదు. ఒకరోజు నా కాలిగొలుసిచ్చేశాను. నా భర్త యేమయిందని అడిగాడు, పోయిందన్నా. నా అజాగ్రత్తకి కోపపడ్డారు. "నా గొలుసుకదా? పోతే మీకేమి?" అన్నాను.

"నీది? నీదేమిటి? నువ్వూ నేను వొకటికాదూ?" అన్నారు.

"మరి మీవాచి పారేసుకుంటే నేనేమన్నా అన్నానా?"

"అదీ, నాదీ, నీకేం?"

"ఇది నాది మీకేం?"

"నువ్వు, నీవీ, అన్నీనావే"

ఇదో కొత్తసంగతి. నా నగలు నావికావు. అమ్మ యిచ్చినవి కూడా ఆయనవేట. మూడురోజులలో మళ్ళీ వెంకటస్వామి ప్రత్యక్షం. యెంత బతిమాలినా నేనియ్యను పొమ్మన్నాను. ఆ సాయంత్రం నా పెనిమిటి యింటి కొచ్చేటప్పుడు, వెనకాల వెంకటస్వామికూడా వొస్తున్నాడు. నా గుండె గుభేలుమంది. ఆయన వెంకటస్వామిని లోపలికి రమ్మని, మాగది తలుపు

గడియవేసి, "యితను తాగి రోడ్డుమీద నీ సంగతి అరుస్తున్నాడు. అదంతా నిజమేనా" అన్నాడు. వెంకటస్వామికి అప్పుడే తెలివివొస్తోంది. సిగ్గుతో నాముందు తలవొంచుకున్నాడు. "అతన్నే అడగండి"

"అడిగానులే. నువ్వుచెప్పు"

"చిన్నప్పుడేదో అయిపోయింది." అన్నాను.

"యీసంగతి చెప్పకుండా, మించిపోకండా నన్ను పెళ్లి చేసుకున్నావా? యింత కుట్ర బుద్ధివుందని నాకు తెలియలేదు."

ఆయన అప్పగార్నికూడా పిలిచి ఆలోచనలు మొదలు పెట్టారు. వెంకటస్వామి యింకయెవరితోనూ చెప్పనని వాగ్దానాలుచేశాడు. కాని తాగు మోతువాణ్ణి నమ్ముతారా? యిది వూళ్ళో యెల్లాగూ తెలుస్తుంది. పరువు పోతుందని నిశ్చయమయింది. ఇంక నన్ను వొదిలెయ్యాలి. అట్లాంటిదాన్ని దగ్గిర వుంచుకోడమెట్లా? బండి పిలిచి, దాంటో నా బట్టలూ, నగలూపెట్టి నన్ను వెళ్ళిపొమ్మన్నారు. మానాన్నా, వాళ్ళింటికనుకున్నా, కాదు. 'నాలుగు రోజులుండిరా- మాచెల్లెలుగారింటో యీ అల్లరి అణగింతరవాత చూద్దా మన్నారు. సగందూరం వెళ్ళేటప్పటికి వెంకటస్వామి వొస్తున్నాడు. యిదే మిటన్నా.

'నిన్ను నాకిచ్చేశారు. ఆ నగలతో హాయిగా కాపరం చేద్దామ'న్నాడు వాడితో కాపరం యేమిటో నాకు తెలుసు. వాడితో పోట్లాడి మర్నాడు మధ్యాన్నానికి తిండిలేక, మాడి, మావూరు చేరుకున్నా. అందరూ నావంక వికారంగా చూస్తున్నారు. నాపెనిమిటీవాళ్ళూ నేను వెంకటస్వామితో లేచి పోయినానని అపవాదు పుట్టించారు. పెద్దగుంపు పోగయింది. నాపెనిమిటి యింటిదగ్గిర నన్ను నావొదిన బాగా తిట్టి తోలేసింది. ఆ పెట్టెలక్కడనే పారేశి, మానాన్న గారింటికి బయలుదేరాను. ఆగుంపంతా వెనకాలొచ్చింది. వాళ్ళు నా చెవినిపడేట్టు అనేమాటలు సరే, సరి. మాఅమ్మ తలుపు తియ్య లేదు, పొమ్మంది.

దొరగారు, మిషనరీ దగ్గిరి కెళ్ళాను. చూడ్డానికి వీల్లేదుపొమ్మన్నారు. దొరసానికూడా పొమ్మంది. నాకు దిక్కులేక అల్లాడుతూవుంటే, వెంకట

స్వామి ఒక్కడే సహాయం చేశాడు. ఒకగుడిశ కుదిర్చి పెట్టి, నాకు సదుపాయాలు కలగచేశాడు. ఆ సహాయం తీసుకోడంతప్పా? దాంతోటి అందరి అనుమానాలూ దృఢపడ్డాయి. యెవరూ సహాయం చెయ్యరు: చేసినవాళ్ళ మీద అనుమానం.

వెంకటస్వామికి తాగుడెక్కువయింది. కాని నాజోలికిరాడు; నా వాకిట్లో కుక్కలాగ పడుకుని కాపలికాస్తాడు. అప్పుడప్పుడు తాగి నిన్నిట్లా చేశానని యేడుస్తాడు. నా మీద అతనికిప్రేమని నాకు తెలుసు. పశ్చాత్తాపంతో దహించుకుపోయి, దూరాన వుంటున్నాడు—నా అమ్మ, పెనిమిటి, స్నేహితులు అందరూ వెలేశారు. ఒక్కరు మాట్లాడరు. నన్ను గుళ్ళోకి రానీరు. క్రైస్తుదగ్గిర్నించికూడా నాకు వెలి. పుణ్యాత్ములకే ఆ క్రిస్టియను మతం. మళ్ళీ యేసుక్రీస్తు పాపాత్ములకోసం పుట్టాడంటారు, అయినా నేను చేసిన పాపమేమిటి? యేవో, చిన్న చిన్న పాపాలూ,మోసాలూ, కుట్రలూ, స్వార్ధపరత్వం, అబద్దాలూ, యివి చేస్తే క్షమిస్తాడుగాని, యిట్లాంటి పెద్ద పాపాలు క్షమిస్తాడా యేసుక్రీస్తు? తక్కిన పాపాలు పశ్చాత్తాపంతో పోతాయి, యిది నేను పశ్చాత్తాపం పడ్డా పోదు. అయినా యేంచేశానని? దేనికని నేను పశ్చాత్తాపపడాలి? బయిటికిరాని పాపాలు,తెరలచాటువీ, గోడ చాటువీ, దేవుడుచూడడు. కాని నలుగురూ అవునంటే, నేను చెయ్యక పోయినాసరే, దేవుడు వెలేస్తాడు. మావూళ్ళో గొప్ప జడ్జీవున్నారు. ఆయనా క్రిస్టియనే. ఆయన పెళ్ళాన్నొదిలేసి యింకోదాన్ని తెచ్చుకొనితనతో వుంచుకొన్నాడు. "నీతేమిటి? పెళ్ళామేమిటి?" అని నవ్వుతాడు. మా పాస్టరు, మాకి గురువు,మా ఆత్మాధికారి ఎప్పుడూ ఆయనింటోనే వుండడం,పాస్టరుభార్యకి ఆ వుంచుకున్న మనిషికీ అపరిమిత స్నేహం. నామొహం మాత్రం యెవరూ చూడరు. నేనేం చేశాను? ఖర్తలతో సుఖంగా కాపరాలుచేస్తో నాపేరుచెపితే వుమ్మేసే పతివ్రతల్లారా, నేనేం చేశానో చెప్పండి? నాకుమల్లే మీరూపుడితే మీరేం చేశేవారో చెప్పండి.